క్లుప్తంగా

బీఆర్‌ఎస్ సభను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకటౌన్: ఈ నెల 25న దుబ్బాక పట్టణంలో బీఆర్‌ఎస్ ప్రతినిధుల సభను నిర్వహిస్తున్నట్లు ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం 27ను పురస్కరించుకొని పార్టీ అధినేత, సీఎం కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి హరీశ్‌రావుల ఆదేశాల మేరకు 25న దుబ్బాకలో 5 వేల బీఆర్‌ఎస్ కుటుంబ ప్రతినిధులతో సభను నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గంలోని పట్టణాలు, వార్డులు, గ్రామాల్లో ఉదయం 9 గంటలకు పార్టీ శ్రేణులతో కలిసి పండగ వాతావరణంలో జెండాలను ఎగురవేయాలన్నారు. అనంతరం 10 గంటల వరకు దుబ్బాకలోని కోమటిరెడ్డి రజనీకర్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో జరిగే సభకు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి, జెడ్పీటీసీ కడతల రవీందర్‌రెడ్డి, నాయకులు గుండెల్లి ఎల్లారెడ్డి, రాజమౌళి తదితరులు ఉన్నారు.

ఆర్థికసాయం

తొగుట(దుబ్బాక): మండలంలోని కాన్గల్‌కు చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు మరుపల్లి శ్రీనివాస్‌గౌడ్ రెండురోజుల క్రితం మరణించాడు. విషయం తెలుసుకున్న దివంగత ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి సతీమణి సుజాత, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మామిడి మోహన్‌రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను శనివారం పరామర్శించి మోహన్‌రెడ్డి రూ.20వేలు, సుజాత రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రేమలచంద్రారెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కుర్మ యాదగిరి, రాయపోల్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌చారి, నాయకులు లక్ష్మినారాయణ, హన్మంతరెడ్డి, కనకయ్య, స్వామి, మురళి పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ కుటుంబానికి చేయూత

దుబ్బాక: దౌల్తాబాద్ మండలం దొమ్మాట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కొమ్ము నర్సింలు శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ యువజన సంఘం మండల అధ్యక్షుడు నర్ర రాజేందర్ బాధిత కుటుంబానికి రూ.10వేల ఆర్థికసాయం అందించారు. అదేవిధంగా భగత్‌సింగ్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి రూ.10 వేలు అందించారు. కార్యక్రమంలో నాయకులు స్వామి, కృష్ణ, నవీన్, యాదగిరి, పరశురాములు, అంజి, సురేశ్, తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని ఇర్కోడ్ 33కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌కు సంబంధించిన మరమ్మతుల కారణంగా ఇర్కోడ్ గ్రామంతో పాటు, పలు పరిశ్రమలకు, భూర్గుపల్లి గ్రామానికి ఆదివారం విద్యుత్ అంతరాయం కలగనున్నట్లు ఏఈ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు, విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.


నంగునూరు ఈద్గా వద్ద..


దుబ్బాకలో ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి


కొండపాక(గజ్వేల్): దుద్దెడలో..


చిన్నకోడూరులో..


తొగుట(దుబ్బాక): చందాపూర్‌లో..


కోహెడలో..

ఘనంగా రంజాన్

జిల్లా వ్యాప్తంగా రంజాన్ పర్వదిన వేడుకలను శనివారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఉదయం నుంచే మసీదులు, ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకనొకరు ఆలింగనం చేసుకొని పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దీంతో మసీదులు, ఈద్గాల వద్ద సందడి నెలకొంది. అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. దుబ్బాకలో ఈద్గా వద్ద ఎంపీ ప్రభాకర్‌రెడ్డి ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపారు. అల్లాదయతో అందరూ సంతోషంగా ఉండాలని కోరుకున్నారు.


హుస్నాబాద్: ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు


చేర్యాల(సిద్దిపేట): ముస్లింలకు శుభాకాంక్షలు తెలుపుతున్న వైస్ చైర్మన్ తదితరులు


మిరుదొడ్డి(దుబ్బాక): రంజాన్ వేడుకల్లో ముస్లింలు


మద్దూరు(హుస్నాబాద్): ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలి

బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రూప్‌సింగ్


మాట్లాడుతున్న రూప్‌సింగ్

హుస్నాబాద్: బీజేపీ కో హటావో– దేశ్ కో బచావో అని ముక్తకంఠంతో నినాదిస్తూ కార్మికులందరూ ఏకమై మేడే రోజు కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి ఎల్.రూప్‌సింగ్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం కార్మిక సంఘ నాయకులు, మహిళలతో కలిసి మేడే వేడుకలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రూప్‌సింగ్ మాట్లాడుతూ.. 137 సంవత్సరాల క్రితం కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు తిరిగి కేంద్రంలో ఉన్న బీజేపీ పాలనలో పునరావృతం అయ్యే ప్రమాదం పొంచి ఉందన్నారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణతో యావత్ కార్మిక వర్గం తీవ్ర ప్రమాదానికి గురయ్యే పరిస్థితులు దాపురిస్తున్నాయన్నారు. బీజేపీ కో హటావో-దేశ్ కో బచావో అనే దృఢ సంకల్పంతో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున కార్మిక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ఆధ్వర్యంలో కార్మిక సంఘ నాయకులతో కలిసి క్యాంప్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు భారీ ర్యాలీగా వెళ్లి జెండాను ఆవిష్కరించనున్నట్లు రూప్‌సింగ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు, కార్మికులు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

సమాచారం లేకుండా పార్టీ కార్యక్రమాలా?



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

సిద్దిపేటకమాన్: ఇష్టారీతిగా వ్యవహరిస్తున్న చక్రధర్‌గౌడ్‌పై బీజేపీ అధిష్టానం వెంటనే చర్యలు తీసుకోవాలని బీజేపీ సిద్దిపేట అర్బన్ మండల అధ్యక్షుడు పురుమాండ్ల నర్సింహారెడ్డి, రూరల్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలు తెలియని వారిని పార్టీలో చేర్చుకోవడం ఏ రోజుకైన పార్టీకి ముప్పే అని చెప్పుకొచ్చారు. జిల్లాలోని సీనియర్ నాయకులకు సమాచారం ఇవ్వకుండా ఇటీవల బీజేపీలో చక్రధర్‌గౌడ్‌ను చేర్చుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దొంగనోట్ల కేసులో, రేపిస్టు కేసులు ఉన్నవారిని పార్టీలో చేర్చుకొని ఏం సందేశం ఇద్దామని అనుకుంటున్నట్లు తెలిపారు. తమ మండలాల్లో పార్టీ కార్యక్రమాలకు సమాచారం ఇవ్వకుండానే చక్రధర్‌గౌడ్ ఇష్టారాజ్యంగా పార్టీ కార్యక్రమాలు చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీ నియమాల ప్రకారం జిల్లా అధ్యక్షుడికి, మండల, బూత్ అధ్యక్షులకు, సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని కానీ ఇవేమి అతడు పాటించడం లేదన్నారు. 20 ఏళ్లుగా పార్టీలో పనిచేస్తున్న కార్యకర్తలను పక్కన పెడుతున్నాడని తెలిపారు. ఇష్టారీతిగా వ్యవహరిస్తున్న చక్రధర్‌గౌడ్‌పై బీజేపీ అధిష్టానం వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. మరోరెండు రోజుల్లో చక్రధర్‌గౌడ్ తీరు మార్చుకోకపోయినా, పార్టీ అధిష్టానం చర్యలు చేపట్టకపోయినా తాము ఏ నిర్ణయమైనా తీసుకుంటామన్నారు. సమావేశంలో నాయకులు రమేశ్‌రెడ్డి, శ్రీనివాస్, ముబీన్ పాల్గొన్నారు.

కొత్త వాళ్లకు ప్రాధాన్యం ఇవ్వడం సరికాదు

సిద్దిపేటకమాన్: ఏళ్ల నుంచి పనిచేసే క్షేత్రస్థాయి కార్యకర్తల అభిప్రాయాలను తీసుకోకుండా అధిష్టానం ఏకపక్ష నిర్ణయం తీసుకుంటూ పార్టీలో ఇటీవల వచ్చిన కొత్త వాళ్లకు ప్రాధాన్యం ఇవ్వడం సరికాదని సిద్దిపేట అర్బన్ బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు యాదగిరి అన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇన్నాళ్ల నుంచి పార్టీ కోసం కష్టపడే వారిని గుర్తించకుండా సిద్ధాంతాలను మరిచిపోయి బీజేపీ వ్యవహరిస్తుందన్నారు. చక్రధర్‌గౌడ్‌పై పార్టీ పెద్దలు వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రాములు, నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

హుస్నాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత


పనులను ప్రారంభిస్తున్న రజిత

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణ అభివృద్ధిలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. శనివారం పట్టణంలోని తెలంగాణ కాంప్లెక్స్, బస్ డిపో వెనక కాలనీలో రూ.20లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ రజిత మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపించకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలన్నారు. పట్టణంలో రోజురోజుకు అభివృద్ధి చెందుతూ విస్తరిస్తుందన్నారు. మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ సహకారంతో పట్టణాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ కోమటి స్వర్ణలత, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, చిత్తారి రవీందర్, కోమటి సత్యనారాయణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

భక్తుల కోరిక మేరకే కొమురవెల్లిలో రైల్వేస్టేషన్


కొమురవెల్లిలో బండి సంజయ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): భక్తుల కోరిక మేరకే కొమురవెల్లిలో రైల్వేస్టేషన్ ఏర్పాటుకు కేంద్రం అంగీకరించిందని బీజేపీ మండల అధ్యక్షుడు దండ్యాల వెంకట్‌రెడ్డి అన్నారు. శనివారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బురుగు సురేశ్‌తో కలసి బాణాసంచా కాల్చి, బండి సంజయ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మల్లికార్జునస్వామి వారిని వేల మంది దర్శించుకుంటారన్నారు. కొమురవెల్లిలో రైల్వేస్టేషన్ ఏర్పాటు చేయాలని చాలా రోజుల నుంచి పోరాటం చేస్తున్నామన్నారు. రైల్వేస్టేషన్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు స్వాములపల్లి భిక్షపతి, శ్రీనివాస్, భాస్కర్, కొయ్యడ శ్రీనివాస్, గొల్లపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

కొండపాక(గజ్వేల్): గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రమైన కొండపాకలోని నల్ల చెరువు వద్ద ఎస్‌డీఎఫ్ నిధులు రూ.28లక్షలతో లోలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శనివారం డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా అయన నల్ల చెరువు వద్ద రైతుల సౌకర్యార్థం చేపడుతున్న లోలెవల్ బిడ్జి నిర్మాణం 2 నెలలోపు పనులు పూర్తయ్యేలా చూసుకోవాలని కాంట్రాక్టరును ఆదేశించారు. అనంతరం ఈజీఎస్ పనులు తీరులు ఎలా ఉన్నాయంటూ కూలీలను అడిగి తెలుసుకున్నారు. రోజుకు రూ.100 కూడా కూలీ పడటం లేదంటూ కూలీలు దేవేందర్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే అక్కడి నుంచి ఈజీఎస్ అధికారులతో మాట్లాడి ఎండాకాలం దృష్ట్యా ఎండ ముదరకముందే పని బంద్ అయ్యేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ చిట్టి మాధురీరెడ్డి, ఎంపీటీసీలు మంచాల అనసూయ, ఆరుట్ల లక్ష్మి, మాజీ ఎంపీపీ బొద్దుల కనుకయ్య, కాంట్రాక్టరు కుమార్, నాయకులు దొమ్మాట మహిపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మల్లారెడ్డి, కనకయ్య, కనకరాంలు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పంచభూతాలను కలుషితం చేయొద్దు

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ ధరిత్రి దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవన్‌కుమార్ మాట్లాడుతూ.. డిసెంబర్ 2021న ప్రారంభమైన పునీత్‌సాగర్ కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సాగర్ జలాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్లాస్టిక్ సంబంధిత వ్యర్థాలతో నీటిని కాలుష్యం చేయొద్దన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకు పోకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సీతారాములు, ఐక్యూఏసీ ఇన్‌చార్జ్ డాక్టర్ స్రవంతి, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ సువర్ణాదేవి, ఎన్‌సీసీ ఇన్‌చార్జ్ సిరినేని స్వప్నలు మాట్లాడుతూ.. పంచభూతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. భూమిని సురక్షితంగా ఉంచుకునేందుకు మనమంతా ప్రయత్నం చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కమలాకర్, హరిప్రసాద్, జ్యోతి, కిషోర్, సౌజన్య, నరేశ్, పద్మ పాల్గొన్నారు.

అమర జవాన్లకు నివాళి


కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న హైందవులు

గజ్వేల్‌రూరల్: ఉగ్రవాదుల దాడిలో అమరులైన భారత సైనికులకు హైందవులు నివాళులర్పించారు. శనివారం రాత్రి పట్టణంలోని స్వామి వివేకానంద చౌరస్తా వద్ద ప్రారంభమైన కొవ్వొత్తుల ర్యాలీ అంబేడ్కర్ చౌరస్తా నుంచి జాలిగామ బైపాస్ రోడ్డు గుండా ఇందిరాపార్కు చౌరస్తా నుంచి ఢిల్లీవాల హోటల్ మీదుగా తిరిగి ఇందిరాపార్కు చౌరస్తా వద్దకు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హైందవులు మాట్లాడుతూ.. ఉగ్రవాదులు జరిపిన దాడిలో అమరులైన వీరజవాన్లు దేశానికి అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ నరేశ్‌బాబు, నర్సింలు, గుంటుకు శ్రీను, నాగరాజు, మల్లికార్జున్, బాల్‌కుమార్, రమణ, సందీప్, సందీప్, జనార్దన్, వినోద్, రమణాకర్, సురేశ్, కిరణ్‌కుమార్, సంతోష్‌కుమార్, హన్మంతు, తులసీదాస్, శ్రీకాంత్, చిన్నారులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

కోహెడరూరల్(హుస్నాబాద్): వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చింతకింది శంకర్ అన్నారు. శనివారం మండలంలోని సముద్రాల గ్రామంలో ఆయన రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. రైతులు కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యం తీసుకొచ్చి రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు కొనుగోలు ప్రారంభించ లేదన్నారు. అకాల వర్షాలతో ధాన్యం తడిచే ప్రమాదం ఉన్నందున రైతులు ఆందోళనకు గురవుతున్నారన్నారు. ఇప్పటికైనా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలని లేదంటే రైతులతో కలసి ఆందోళన చేస్తామన్నారు.

◆ బాధితుడికి మొబైల్ అప్పగింత

మిరుదొడ్డి(దుబ్బాక): పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను ఈసీఐఆర్ ద్వారా కనుక్కొని బాధితుడికి భూంపల్లి పోలీసులు అందించారు. అక్బర్‌పేట-భూంపల్లి ఎస్‌ఐ గంగరాజు శనివారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని నగరం గ్రామానికి చెందిన రవి అనే వ్యక్తి తన రియల్ మీ సీ32 మొబైల్‌ను గతేడాది డిసెంబర్ 20న పోగొట్టుకున్నాడు. ఈ క్రమంలో ప్రభుత్వం తీసుకొచ్చిన సీఈఐఆర్.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో శనివారం ఉదయం ఫోన్ ఐఎంఈఐ నంబర్‌ను ఎంటర్ చేసి బ్లాక్ చేశాడు. మొబైల్ దొరికిన వ్యక్తి సిమ్ కార్డు ఫోన్‌లో వేసుకున్న కారణంగా ఈ వెబ్‌సైట్ ద్వారా అతని వివరాలతో కూడిన సమాచారం పోలీసులకు చేరింది. సమాచారం అందుకున్న పోలీసులు ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి, ఫోన్‌ను స్వాధీనం చేసుకొని పోగొట్టుకున్న రవికి భూంపల్లి పోలీస్ స్టేషన్‌లో అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ బిక్యానాయక్, రైటర్ హరికృష్ణ, కానిస్టేబుల్ వినిత తదితరులు పాల్గొన్నారు.

◆ ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించాలి

గజ్వేల్‌రూరల్: ఉపాధి కూలీల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారికి ఒకేపూట పనులను కల్పించాలని డీబీఎఫ్ నాయకులు పేర్కొన్నారు. శనివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎండతీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కూలీలకు ఒకేపూట పని కల్పించడంతో పాటు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలన్నారు. పనులు జరిగే చోట కనీస సౌకర్యాలు లేకపోవడంతో కూలీలు అస్వస్థతకు గురై మృతి చెందిన సంఘటనలున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికైనా స్పందించి కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించడంతో పాటు పెండింగ్ వేతనాలను చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలను చేపడతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండ స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు తదితరులు పాల్గొన్నారు.

◆ వైభవంగా కృత్తిక మహోత్సవం

వర్గల్(గజ్వేల్): వర్గల్ విద్యా సరస్వతీ క్షేత్రంలోని సుబ్రహ్మణ్యేశ్వరాలయంలో శనివారం కృత్తిక మహోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. స్వామివారి జన్మనక్షత్రం పురస్కరించుకొని ఆలయ వ్యవస్థాపకుడు చంద్రశేఖరశర్మ సిద్ధాంతి పర్యవేక్షణలో వేద పండితులు, వేద విద్యార్థులు లక్ష సుబ్రహ్మణ్య నామాలు పఠిస్తూ మూలవిరాట్‌కు భస్మార్చన చేశారు. విశేష అభిషేకం, అలంకరణ అనంతరం శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడిని భక్తులు దర్శించుకొని తరించారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ నిరుపేదలకు వరం

దుబ్బాక: నిరుపేదలకు సీఎంఆర్‌ఎఫ్ పథకం అండగా ఉంటుందని సర్పంచ్ చిత్తారిగౌడ్ అన్నారు. దౌల్తాబాద్ మండలం ఉప్పర్‌పల్లి గ్రామానికి చెందిన చాకలి నర్సవ్వకు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా మంజూరైన రూ.28వేల చెక్కును శనివారం సర్పంచ్ చిత్తారిగౌడ్ బాధితురాలికి అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అల్లి శేఖర్‌రెడ్డి, నాయకులు నాగరాజ్‌గౌడ్ తదితరులున్నారు.

మర్కూక్(గజ్వేల్): మండలంలోని దామరకుంట గ్రామానికి చెందిన రాజుబోయిన నాగమల్లుకు మంజూరైన రూ.57వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు కృష్ణయాదవ్ అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గాయత్రీబాల్‌నర్సయ్య, నాయకులు మహేశ్ పాల్గొన్నారు.


కొమురవెల్లి: అయినాపూర్‌లో రాలిన మామిడికాయలు


బెజ్జంకి: ఏఎంసీలో ధాన్యం నుంచి నీటిని తొలగిస్తున్న రైతులు

వడగండ్ల బీభత్సం

- వరి, మామిడి పంటలకు తీవ్ర నష్టం
- కొనుగోలు కేంద్రాల్లో తడిచిన ధాన్యం


మద్దూరు(హుస్నాబాద్): తడిసిన ధాన్యం

సాక్షినెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా శనివారం కురిసిన వడగళ్ల వర్షం రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చింది. ఆయా గ్రామాల్లో వడగండ్లకు వరిపైరు నేలవాలగా, కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం కుప్పలు తడిచిపోయాయి. మామిడికాయలు రాలిపోయాయి. కొమురవెల్లి, అయినాపూర్, రాంసాగర్, రసులాబాద్, తపాస్‌పల్లి, పోసాన్‌పల్లి, గురువన్నపేట భారీ వడగళ్లు పడడంతో సుమారు 8వేల ఎకరాల్లో వరి, 200 ఎకరాల్లో మామిడిపంటకు నష్టం వాటిల్లింది. అయినాపూర్‌కు చెందిన రైతు కానుగుల శ్రీనివాస్ సమస్యను వివరించేందుకు మంత్రి హరీశ్‌రావు ఫోన్ చేయగా, మంత్రి మీటింగ్‌లో ఉండడంతో పీఏతో ఫోన్‌లో మాట్లాడాడు. మంత్రి మీటింగ్ నుంచి వచ్చిన తర్వాత విషయం తెలియజేస్తానని చెప్పినట్లు రైతు సాక్షికి తెలిపారు. కుకునూరుపల్లి మండలంలోని బొబ్బాయిపల్లి రైతు రెడ్డమైన రవీందర్ సాగుచేసిన బొప్పాయి బొప్పాయి తోటకు నష్టం వాటిల్లింది. బెజ్జంకిలో ఏఎంసీలో ఆరబోసిన ధాన్యం తడిసింది. హుస్నాబాద్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కుప్పలు పూర్తిగా తడిసిపోయాయి. వానకు పట్టణంలో రహదారులు జలమయమయ్యాయి. రోడ్డుపై నిలిచిన వరద నీటితో వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చేర్యాలలో కురిసిన వానకు వీరన్నపేట, నాగపురి, శబాష్‌గూడెం, పోతిరెడ్డిపల్లి, పెద్దరాజుపేట, కడవేర్గు గ్రామాల్లో వరి చేలు నేలవాలింది. మామిడి కాయలు రాలిపోయి, పౌల్ట్రీలో కోళ్లు మృతి చెందాయి. ఈదురుగాలుల ధాటికి విద్యుత్ స్తంభాలు విరిగి, ట్రాన్స్‌ఫార్మర్ నేలకూలింది. నష్టం తీవ్రతను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి సాయం అందేలా చూస్తానని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి తెలిపారు. నారాయణరావుపేట మండలంలోని పలు గ్రామాల్లో కోతకు వచ్చిన వడ్లు రాలిపోవడంతో రైతులు విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం త్వరగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ఆదుకోవాలని కోరుతున్నారు.


చేర్యాల: పోతిరెడ్డిపల్లిలో పడ్డ వడగండ్లను చూపుతున్న రైతు


చేర్యాల: నేలకూలిన విద్యుత్ స్తంభం


కొమురవెల్లి: అయినాపూర్‌లో నేలకొరిగిన వరి పంట


హుస్నాబాద్: నీటి నుంచి ధాన్యాన్ని వేరుచేస్తున్న రైతు


నంగునూరు: వరి ధాన్యం వద్ద నిలిచిన నీటిని తొలగిస్తున్న దృశ్యం


సిద్దిపేటరూరల్: నారాయణరావుపేటలో తడిసిన ధాన్యం